రహదారిపై బైఠాయించిన రైతులు

సమగ్రాభివృద్ధికి సహకరించండి

- ఎస్‌సి ఉపకులాల వర్గీకరణ
- దేశంలోనే మొట్టమొదటగా డ్రగ్స్ ఫ్రీ స్టేట్‌గా తెలంగాణ
- నీతి ఆయోగ్ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ సమగ్రాభివృద్ధికి కేంద్రం సహకరించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో 2028 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనేదే లక్ష్యమని ప్రకటించారు. రాజీవ్ యువ వికాసం పథకం కింద యువతకు రూ.5 లక్షల స్వయం ఉపాధి పథకాన్ని జూన్ 2 నుంచి ప్రారంభిస్తామన్నారు. శనివారం న్యూఢిల్లీలోని ప్రగతి మైదానంలో భారత మండపంలో ప్రధాని మోడీ అధ్యక్షతన జరిగిన నీతి ఆయోగ్ పదో గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశంలో వృద్ధిరేటు, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, రెండో, మూడో శ్రేణి నగరాల అభివృద్ధి వంటి వివిధ అంశాలపై చర్చించారు.

ప్రధాని మోడీతో చర్చిస్తున్న సిఎం రేవంత్

తెలంగాణ అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం

జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాంలో మారణకాండ సృష్టించిన ఉగ్రవాదుల దారుణ చర్యకు వ్యతిరేకంగా భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ నిర్వహించినందుకు మోడీకి, భారత సైన్యానికి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. 1971లో ఇందిరాగాంధీ నాయకత్వంలో పాకిస్తాన్‌ను ఓడించి, ఆ దేశాన్ని రెండు ముక్కలుగా చీల్చిన చరిత్రను ఆయన గుర్తు చేశారు. 2047 నాటికి మన భారత దేశాన్ని సూపర్ పవర్‌గా, నెంబర్‌వన్‌గా నిలబెట్టాలన్న మోడీ సంకల్పాన్ని ముఖ్యమంత్రి స్వాగతించారు. 'వికసిత్ భారత్' ప్రణాళికను రూపొందించడం అభినందనీయమన్నారు. అదే స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధికి ప్రణాళిక సిద్ధమైందనీ, ఆర్థిక, సామాజిక, పరిపాలన రంగాల్లో ఆదర్శవంతమైన లక్ష్యాలతో తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్ రూపొందించామని సీఎం అన్నారు.

తెలంగాణ రైజింగ్ విజన్‌లోని నాలుగు కీలక అంశాలను ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రస్తావించారు. పేదల సంక్షేమం, సమగ్ర పాలసీల రూపకల్పన, వరల్డ్ క్లాస్ ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్, పారదర్శక సుపరిపాలన లక్ష్యాలకు ప్రాధాన్యమిస్తామన్నారు. తెలంగాణ సమగ్రాభివృద్ధికి ఇప్పటికే వెల్ఫేర్ అండ్ సోషల్ జస్టిస్ పాలసీ, గ్రీన్ ఎనర్జీ పాలసీ, ఇన్‌ఫ్రా అండ్ ఇండస్ట్రియల్ పాలసీ, టూరిజం పాలసీలను సిద్ధం చేసి కార్యాచరణలో పెట్టినట్టు రేవంత్‌రెడ్డి తెలిపారు.

కులగణనను స్వాగతిస్తున్నాం

అభివృద్ధిలో, సంక్షేమంలో ఆయా వర్గాలకు న్యాయమైన వాటా ఇవ్వాలన్నదే తమ సంకల్పమన్నారు. అందుకే తెలంగాణలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ కులగణన చేపట్టామని తెలిపారు. బీసీలకు విద్య, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు, ఎస్‌సి ఉపకులాల వర్గీకరణ.. ఈ రెండు చారిత్రాత్మక నిర్ణయాలను దేశంలోనే మొట్టమొదటగా తెలంగాణ అమలు చేయడం గర్వంగా ఉన్నదని సిఎం తెలిపారు. దేశవ్యాప్త కులగణనకు కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. కులగణనలో తెలంగాణ అనుభవాలను పంచుకునేందుకు సిద్ధంగా ఉన్నదని ఆయన తెలిపారు.

మహిళలు, యువత కోసం కార్యక్రమాలు

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో మహిళలకు కీలక పాత్ర ఉండేలా విధానాలు రూపొందించినట్టు సిఎం చెప్పారు. మహాలక్ష్మీ ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళా సంఘాలకు రూ.లక్ష కోట్ల రుణాలు, మహిళా సంఘాలకు పాఠశాలల నిర్వహణ, శిల్పారామంలో 100 స్టాళ్లతో మహిళా బజార్ అంశాలను ప్రధానంగా ప్రస్తావించారు. సోలార్ పవర్ జనరేషన్‌లోనూ భాగస్వామ్యం కల్పించి మహిళలను వ్యాపార, పారిశ్రామికవేత్తలుగా ప్రోత్సహించే కార్యక్రమాలు అమలు చేశామన్నారు. "మన దేశ భవిష్యత్తు మన యువత. తెలంగాణ రాష్ట్ర సాధనలో యువతదే కీలక పాత్ర. అందుకే యువత ఆశయాల సాధనకు అనుగుణంగా యూత్ పాలసీ అమలు చేస్తున్నాం. 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశాం. ప్రయివేటు రంగంలో లక్ష ఉద్యోగాలు సృష్టించాం" అని రేవంత్‌రెడ్డి తెలిపారు. "ఒకవైపు మానవ వనరులకు డిమాండ్ పెరుగుతున్నా.. మరోవైపు నిరుద్యోగ సమస్య నెలకొంది. నైపుణ్యాల కొరతే ఈ అంతరానికి కారణమని గుర్తించాం. అందుకే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ, పోలీస్ స్కూల్, ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూల్స్, ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా ఆధునీకరించి నైపుణ్య శిక్షణ ఇస్తున్నాం" అని సీఎం వివరించారు. తెలంగాణను డ్రగ్స్ ఫ్రీ స్టేట్‌గా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి ప్రకటించారు. మాదక ద్రవ్యాల నిర్మూలన, వాటికి అడ్డుకట్ట వేయటంలో తెలంగాణ నెంబర్-1 స్థానం సాధించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

రైతులు అప్పుల ఊబిలోకి జారకుండా పనిచేస్తున్నాం

"తెలంగాణలో 25.35 లక్షల మంది రైతులకు, రూ.20,616 కోట్ల రుణమాఫీ చేసి వారిని రుణ విముక్తులను చేశాం. సాగు కోసం రైతు మళ్లీ అప్పులపాలు కాకూడదన్న ఉద్దేశంతో ఎకరాకు రూ.12 వేల చొప్పున రైతు భరోసా సాయం చేస్తున్నాం. బియ్యానికి మద్ధతు ధరకు అదనంగా క్వింటాల్‌కు రూ.500 చెల్లించి వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తున్నాం. రైతుకు చేదోడుగా ఉండే వ్యవసాయ కూలీకి రూ.12 వేల ఆర్థిక సాయం చేస్తున్నాం. ఈ రోజు వరి ఉత్పత్తిలో దేశంలో తెలంగాణ నెంబర్ వన్ గా ఉంది. గతేడాది 2.90 కోట్ల టన్నుల ఉత్పత్తిని సాధించి దేశానికి ఆదర్శంగా నిలిచాం. ఈ నేపథ్యంలో రైతుల కోసం చేసే వ్యయాన్ని సంక్షేమ కోణంలో కాకుండా ఆహార సంపద సృష్టికి పెడుతున్న పెట్టుబడిగా చూడాలి" అని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

తెలంగాణ రైజింగ్-2047 విజన్

2047 నాటికి ఇండస్ట్రీ, ఇన్‌ఫ్రా విషయంలో అంతర్జాతీయ నగరాల సరసన తెలంగాణను నిలబెట్టే భవిష్యత్తు లక్ష్యంతో తెలంగాణ రైజింగ్-2047 విజన్‌ను ఎంచుకున్నట్టు చెప్పారు. ఈ లక్ష్య సాధనలో తొలి అడుగుగా.. ఏడాదిన్నర కాలంలో అమెరికా, జపాన్, సింగపూర్, దక్షిణ కొరియా, దావోస్ (స్విట్జర్‌లాండ్) దేశాలలో పర్యటించి రూ. 3 లక్షల కోట్ల పెట్టుబడులను సాధించామని అన్నారు.

మూడు జోన్లుగా విభజించి మాస్టర్ ప్లాన్

తెలంగాణ రాష్ట్రం మొత్తాన్ని మూడు జోన్లుగా విభజించి మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నామనీ, తెలంగాణను కోర్ అర్బన్, సెమీ అర్బన్, రూరల్ తెలంగాణగా విభజించి వృద్ధి సాధిస్తామన్నారు. రేడియల్ రోడ్లు, తెలంగాణ ప్రతిపాదిత డ్రైపోర్ట్ నుంచి మచిలీపట్నం పోర్టుకు ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం రాష్ట్రాభివద్ధిలో కీలకమవుతాయన్నారు. గుడ్ గవర్నెన్స్‌తో అత్యున్నత ప్రమాణాలతో పౌర సేవలను అందిస్తామనీ, ఇందులో భాగంగా 'బిల్డ్ నౌ' యాప్ ద్వారా నిర్మాణ రంగానికి వేగం పెంచినట్టు సీఎం తెలిపారు.

డేటా సెంటర్ హబ్‌గా హైదరాబాద్

హైదరాబాద్‌ను డేటా సెంటర్ హబ్‌గా మార్చాలనే లక్ష్యంగా పెట్టుకున్నట్టు ముఖ్యమంత్రి చెప్పారు. విద్య, వైద్యంలో అంతర్జాతీయ ప్రమాణాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. తెలంగాణ సమగ్రాభివృద్ధికి సహకరించండి. వికసిత్ భారత్ లక్ష్య సాధనలో తెలంగాణ మొదటి వరుసలో ఉంటుందని మాట ఇస్తున్నాను అని ముఖ్యమంత్రి చెప్పారు.

భూ సేకరణ సదస్సు ఉద్రిక్తం

- మోహరించిన పోలీసులు, ముందస్తు అరెస్టులు
- రిజర్వాయర్ నిర్మాణం తప్పదు : ఎమ్మెల్యే వంశీకృష్ణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బల్మూరు ఉమామహేశ్వర రిజర్వాయర్ నిర్మాణం కోసం నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన భూ సేకరణ సదస్సు ఉద్రిక్తతల మధ్య కొనసాగింది. భూములు కోల్పోతున్న బల్మూరు రైతులతోపాటు అనంతవరం, అంబగిరి, మైలారం గ్రామ రైతులు భూ సేకరణ సదస్సును అడ్డుకుంటారన్న ఉద్దేశంతో సదస్సు ఏర్పాటుచేసిన స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అచ్చంపేట రోడ్డు వైపు అంబేద్కర్ విగ్రహం నుంచి లింగాల రోడ్డు వైపు రైతులు, ప్రజలు గుమికూడకుండా పోలీసులు పెద్ద ఎత్తున మొహరించారు. ప్రజలను రోడ్డుమీదికి రావద్దంటూ హెచ్చరించారు. భూ సేకరణ సదస్సును అడ్డుకుంటారని తెలిసిన 15 మంది రైతు నాయకులను ముందస్తుగానే అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. దాంతో ఆగ్రహించిన రైతులు.. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని, వారు వస్తేనే భూ సదస్సుకు వస్తామని డిమాండ్ చేస్తూ అంబేద్కర్ విగ్రహం ఎదుట బైటాయించారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న తమను పోలీసులు అరెస్టు చేసేందుకు ప్రయత్నించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల ఆందోళనతో దిగొచ్చిన పోలీసులు.. అరెస్ట్ చేసిన వారిని తీసుకురావడంతో రైతులు ఆందోళన విరమించి భూ సేకరణ సదస్సుకు హాజరయ్యారు.

రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం దక్కేలా పోరాడుతా : ఎమ్మెల్యే వంశీకృష్ణ

భూ నిర్వాసితుల సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడి వారికి పూర్తిస్థాయిలో న్యాయం దక్కేంతవరకూ పోరాడుతాను. రిజర్వాయర్ నిర్మాణానికి గత ప్రభుత్వంలోనే పూర్తిస్థాయిలో అనుమతులు లభించాయి. కానీ అప్పుడున్న డిజైన్‌ను మారుస్తూ ప్రస్తుతం 300 ఎకరాల భూమిని తగ్గిస్తూ డిజైన్ చేశారు. దాంతో బల్మూరు గ్రామ సమీపం నుంచి 370 మీటర్ల దూరం, అదేవిధంగా అనంతవరం గ్రామం నుంచి 30 మీటర్ల దూరం రిజర్వాయర్‌ను కుదించారు. 2.60 టిఎంసిలు ఉన్న రిజర్వాయర్ సామర్థ్యాన్ని 2.40 టిఎంసిలకు తగ్గించారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలకు సాగునీరు అందించేందుకు నిర్మించనున్న ఈ రిజర్వాయర్ కోసం.. రిలే దీక్షలు, పాదయాత్రలు కూడా చేశాను. రిజర్వాయర్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న వారికి నష్టపరిహారంతోపాటు వారి కుటుంబంలో అర్హులైన వారికి ఔట్‌సోర్సింగ్ ద్వారా ఉద్యోగాల కల్పన కోసం కృషి చేస్తాను. అచ్చంపేట నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటు చేయాలంటే ఎవరూ ముందుకు రారు.. అందుకే అందుబాటులో ఉన్న సాగునీటిని ప్రతి రైతు పొలానికి పారించడమే తన లక్ష్యం.

సివిల్ కేసులో పోలీసుల జోక్యం

- మానవ హక్కుల కమిషన్ కు ఫిర్యాదు చేసిన మహిళ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భూ వివాదంలో జోక్యం చేసుకొని తమ కుటుంబ సభ్యులను పోలీస్ స్టేషన్ కి తీసుకెళ్లి చిత్రహింసలు పెట్టారని హైదరాబాద్‌కు చెందిన మహిళ మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. తహశీల్దార్ కార్యాలయంలో బలవంతంగా వేలిముద్రలు తీసుకున్నారని ఆమె ఫిర్యాదు చేశారు. మహబూబ్ నగర్ రూరల్ సిఐ నుంచి తమకు రక్షణ కల్పించాలని ఆమె హెచ్‌ఆర్‌సిను కోరారు. వివరాల్లోకి వెళితే, హైదరాబాద్‌కు చెందిన పాలాది కళావతి కుటుంబ సభ్యులు మహబూబ్ నగర్ అర్బన్ మండల పరిధిలోని పాలకొండ గ్రామ శివారులోని సర్వేనెం:272/1 లో 7-30గుంటల భూమిని కొనుగోలు చేశారు. 2023లోనే విక్రయ ఒప్పందం చేసుకొన్నారు. వాటిలో నుండి 51ప్లాట్లు కావాలని జడ్చర్లకు చెందిన శివలింగం అనే వ్యక్తికి విక్రయించేందుకు ఒప్పుకొన్నారు. ఒప్పందం ప్రకారం రూ.50లక్షలు ఇస్తామని కేవలం రూ.30లక్షలు మాత్రమే ఇచ్చారు. అధికార పార్టీ నేత చలువగాలి రాఘవేందర్ రాజు తమ భూమిని అన్యాయంగా కాజేందుకు ప్రయత్నిస్తున్నారని, దీనికి పోలీసులు సహకరిస్తున్నారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. తనకు సిఎం సోదరులతో బాగా పరిచయం, ఉందని, ఏదైనా చేస్తామని బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. మహబూబ్ నగర్ పోలీసులు తమను బెదిరించి రాఘవేంద్ర రాజుకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, సిఐ, ఎస్ఐ పై చర్య తీసుకొని తమకు రక్షణ కల్పించాలని హెచ్‌ఆర్‌సిని కోరారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న విత్తనాలు

వరిగడ్డి మాటున నకిలీ పత్తి విత్తనాలు రవాణా

- 20 క్వింటాళ్లు పట్టివేత

హైదరాబాద్ బ్యూరో : కుమురంభీం - ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో కర్ణాటక నుంచి ఐచర్ వ్యాన్‌లో రవాణా అవుతున్న నకిలీ పత్తి విత్తనాలను శనివారం టాస్క్‌ఫోర్స్, కాగజ్‌నగర్ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. వివరాలను రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌పి శ్రీనివాసరావు మీడియాకు వెల్లడించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం మర్రిగడ్డకు చెందిన వేణుగోపాల్‌రెడ్డి మహారాష్ట్రలోని అహేరికి చెందిన సంతోష్ కిషోర్ ద్వారా ఐచర్ వ్యాన్‌లో పత్తి విత్తనాలను కర్ణాటక నుంచి కాగజ్‌నగర్‌కు తరలిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. కాగజ్‌నగర్‌లోని కాపువాడకు చెందిన కొత్తపల్లి సదాశివ్ వీటిని స్వాధీనం చేసుకొని జిల్లాలోని ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారనే విషయం కూడా పోలీసులకు తెలియడంతో వీరు స్థానిక పెద్దవాగు వద్ద మాటు వేశారు. ఐచర్ వ్యాన్ రాగానే దాన్ని ఆపి తనిఖీ చేయగా అందులో వరిగడ్డి కనిపించింది. వరిగడ్డిని తొలగించి చూడగా లోపల నకిలీ పత్తి విత్తనాల బ్యాగ్‌లు కనిపించాయి. రూ.60లక్షల విలువ కలిగిన 20 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు ఉండగా వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటిని తీసుకోవడానికి అక్కడికి వచ్చిన కొత్తపల్లి సదాశివ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొత్తపల్లి సదాశివ్‌తో పాటు సంతోష్ కిషోర్, ఐచర్ వ్యాన్ డ్రైవర్ పుప్పాల లక్ష్మణ్ (ఏపీలోని కర్నూలు జిల్లా ఆదోని వాసి)ను అరెస్ట్ చేశారు. ప్రధాన నిందితుడైన వేణుగోపాల్‌రెడ్డి (రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం మర్రిగడ్డ వాసి) పరారీలో ఉన్నట్టు ఎస్‌పి వెల్లడించారు.

నేడు ఇసెట్ ఫలితాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో బిటెక్, బిఇ, బి ఫార్మసీ, బిఎస్సీ మ్యాథమెటిక్స్ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ద్వితీయ సంవత్సరంలో లాటరల్ ఎంట్రీ ద్వారా ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఈసెట్ రాతపరీక్ష ఫలితాలు ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటలకు విడుదల కానున్నాయి. ఈ ఫలితాలను హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ) ఇంజినీరింగ్ కాలేజీ ప్రధాన భవనంలోని ఈ క్లాస్‌రూంలో ఉన్నత విద్యామండలి చైర్మన్ వి బాలకృష్ణారెడ్డి, ఓయూ వైస్ ఛాన్సలర్ కుమార్ మొలుగారంతోపాటు ఇతర అధికారులు విడుదల చేయనున్నారు. ఈనెల 12న ఈసెట్ పరీక్షను నిర్వహించిన విషయం తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా 19,672 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, 18,928 (96.22 శాతం) మంది హాజరయ్యారు.

కెటిఆర్‌కు సిస్టర్ స్ట్రోక్

- కాంగ్రెస్‌పై లేనిపోని ఆరోపణలు : మంత్రి సీతక్క

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కెటిఆర్‌కు సిస్టర్ స్ట్రోక్ తగిలి చిన్న మెదడు చితికిందనీ, అందుకే ఆయన ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరంలో విషయంలో కమీషన్లు తీసుకున్నప్పుడు లేని భయం కమిషన్ ముందుకొచ్చేందుకు ఎందుకని ప్రశ్నించారు. కాళేశ్వరానికి కాంగ్రెస్ బాంబులు పెట్టిందని ఆరోపణలు చేయడాన్ని తప్పుబట్టారు. అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు నిరూపించలేదో కెటిఆర్ ఆత్మ పరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. అబద్దాల పునాదుల మీద వాస్తవాలను కప్పిపుచ్చే ప్రయత్నం కెటిఆర్ చేస్తున్నారని విమర్శించారు. గ్లోబల్ ప్రచారానికి కెటిఆర్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రతిపక్ష హోదాకు కెటిఆర్ పనికిరారని తేల్చిచెప్పారు. కెసిఆర్ చుట్టూ దయ్యాలున్నాయనీ కవిత చెప్పిందనీ, ఆ దెయ్యం తమరేనా? అని కెటిఆర్‌ను దెప్పిపొడిచారు. రాహుల్ గాంధీని విమర్శించే అర్హత కెటిఆర్‌కు లేదన్నారు. అధికారం లేనప్పుడు అధికార దుర్వినియోగం ఎక్కడ జరిగిందో ఇడి చెప్పాలని ప్రశ్నించారు.

'రైతుముంగిట్లో శాస్త్రవేత్తలు'కు అనూహ్య స్పందన

- ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం విసి
- 600 గ్రామాల్లో 37వేల మంది రైతులతో అవగాహనా కార్యక్రమం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ సహకారంతో నిర్వహిస్తున్న వినూత్న కార్యక్రమం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' రాష్ట్రవ్యాప్తంగా నిరాటంకంగా, విజయవంతంగా కొనసాగుతోందని, రైతుల నుంచి మంచి స్పందన వస్తోందని అగ్రికల్చర్ యూనివర్సిటీ ఉపకులపతి జానయ్య అన్నారు. శనివారం ఈ కార్యక్రమంపై యూనివర్సిటీలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని ఇప్పటివరకు 600 గ్రామాల్లో నిర్వహించగా, మొత్తం 37వేల మంది రైతులతో శాస్త్రవేత్తలు, వ్యవసాయ విద్యార్థులు ముఖాముఖిగా మాట్లాడారని చెప్పారు. ప్రభుత్వం రైతాంగానికి అమలు చేస్తున్న కార్యక్రమాలు, ప్రస్తుత వ్యవసాయ పరిస్థితులపై రైతాంగంలో ఎటువంటి అసంతృప్తి లేదన్నారు. అయితే మారుతున్న వాతావరణ పరిస్థితులు, అకాల వర్షాల కారణంగా రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతుందని తెలిపారు. ఇంకా కొన్ని వ్యవసాయ అంశాలకు ప్రభుత్వపరంగా ప్రోత్సాహం ఇవ్వాలని రైతులు కోరుతున్నారని చెప్పారు. ముఖ్యంగా ప్రతికూల వాతావరణ పరిస్థితులతో ఎదురయ్యే నష్టాల్ని అధిగమించేందుకు ప్రభుత్వం పంటల బీమా సదుపాయం ప్రవేశపెట్టాలని, చిన్న, సన్నకారు రైతులకు ఆధునిక వ్యవసాయ పనిముట్లు, పచ్చి రొట్ట విత్తనాలను రాయితీపై అందించాలని రైతులు కోరినట్టు చెప్పారు. విస్తృతంగా భూసార పరీక్షలు నిర్వహించాలని రైతుల అభిప్రాయం వ్యక్తమైందన్నారు. ఇదే స్ఫూర్తితో రైతు సోదరులు, మహిళలు, అభ్యుదయ రైతులు, రైతు గ్రూపులు, సంఘాల ప్రతినిధులు, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొని దీన్ని ఒక సామాజిక ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాలని విసి కోరారు.

తక్కువ ర్యాంకు వచ్చిందని విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన ఓ విద్యార్థిని పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలో తక్కువ ర్యాంకు వచ్చిందని ఆత్మహత్యకు పాల్పడ్డారు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. ముస్తాబాద్‌కు చెందిన గూడ శ్రీనివాస్ రెడ్డి, స్రవంతి దంపతులకు కుమారుడు, కూతురు ఉన్నారు. కూతురు స్నేహలత ఇటీవల పదవ తరగతి పూర్తి చేసి పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలకు హాజరైంది. అయితే, ఫలితాల్లో తక్కువ ర్యాంకు రావడంతో ఆమె తీవ్రంగా మనస్తాపానికి గురయ్యారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో స్నేహలత గది ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాలిసెట్‌లో 83,364 మంది ఉత్తీర్ణత

- సూర్యాపేటకు చెందిన శ్రీజ టాపర్
- రెండు ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలు మంజూరు
- ఉపాధి అవకాశాలు పెరిగేలా కొత్త కోర్సులు
- సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పాలిటెక్నిక్, డిప్లొమా, వ్యవసాయ, ఉద్యానవన, వెటర్నరీ కోర్సుల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన పాలిసెట్-2025 రాతపరీక్ష ఫలితాలను సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన శనివారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈనెల 13న పాలిసెట్ రాతపరీక్షను నిర్వహించారు. 1,06,716 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, వారిలో 98,858 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. వారిలో 83,364 (84.33 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. 53,085 మంది బాలురు పరీక్ష రాయగా, 42,836 (80.69 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. 45,773 మంది బాలికలు పరీక్ష రాస్తే 40,528 (88.54 శాతం) మంది అర్హత సాధించారు. 98,858 మంది పరీక్ష రాయగా ఎంపిసి విభాగంలో 80,949 (81.88 శాతం) మంది, ఎంబైపిసి విభాగంలో 83,364 (84.33 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. 18,039 మంది ఎస్‌సి అభ్యర్థులకుగాను 18,037 మంది, 7,459 మంది ఎస్‌టి అభ్యర్థులందరూ ఉత్తీర్ణత సాధించారు.

పాలిటెక్నిక్ కాలేజీలను ఎటిసిలుగా మార్చే ప్రతిపాదన : శ్రీదేవసన

ఈ సందర్భంగా సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన మాట్లాడుతూ రాష్ట్రంలో కేసముద్రం (మహబూబాబాద్ జిల్లా), పటాన్‌చెరు (సంగారెడ్డి జిల్లా)లో రెండు కొత్త పాలిటెక్నిక్ కాలేజీలు మంజూరయ్యాయని వివరించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల సంఖ్య 59కి చేరిందన్నారు. ఇంజినీరింగ్ తరహాలో పాలిటెక్నిక్‌లోనూ ఎమర్జింగ్ టెక్నాలజీ కోర్సులను ప్రవేశపెడుతున్నామని వివరించారు. విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపడేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. పాలిటెక్నిక్ సీట్లకు సంబంధించి ఎఐసిటిఇ అనుమతి ఇవ్వగానే ప్రవేశాల షెడ్యూల్‌ను విడుదల చేస్తామన్నారు. వచ్చేనెలాఖరు నాటికి రావొచ్చని చెప్పారు. ఇటీవల సిఐఐ సమావేశం జరిగిందనీ, ఇంజినీరింగ్ కంటే పాలిటెక్నిక్ విద్యార్థులకే మంచి నైపుణ్యం ఉంటుందనీ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారని గుర్తు చేశారు. సిఐఐతో మాట్లాడి పరిశ్రమలకు ఏం కావాలో విద్యార్థులకు నేర్పించడానికి పాలిటెక్నిక్ అధ్యాపకులకు ఇటీవల శిక్షణ ఇప్పించామని అన్నారు. పాలిటెక్నిక్ కాలేజీలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు (ఏటీసీ)గా మార్చే ప్రతిపాదన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సాంకేతిక విద్యా శిక్షణా మండలి (ఎస్‌బీటీఈటీ) ఇన్‌చార్జి కార్యదర్శి బి శ్రీనివాస్, పరీక్షల నియంత్రణాధికారి, సాంకేతిక విద్యాశాఖ జాయింట్ సెక్రటరీ, షఫియాజ్ అక్తర్, సాంకేతిక విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ జి గిరిబాబు, ఎన్ఐసీ ఎస్ఐవో జి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్ టాపర్ల వివరాలు ఎంపిసి విభాగం

ర్యాంకు	అభ్యర్థి పేరు	జిల్లా
1	గోరుగంటి శ్రీజ	సూర్యాపేట
1	తూమాటి లాస్యశ్రీ	ఖమ్మం
1	ఉంద్యాల కౌశిక్ నారాయణ	మహబూబ్‌నగర్
1	విసవరం దీక్షిక	సంగారెడ్డి
5	షేక్ ఇఫ్రా తస్నీ	సూర్యాపేట

ఎంబైపిసి విభాగం

ర్యాంకు	అభ్యర్థి పేరు	జిల్లా
1	గోరుగంటి శ్రీజ	సూర్యాపేట
1	తూమాటి లాస్యశ్రీ	ఖమ్మం
3	షేక్ ఇఫ్రా తస్నీం	సూర్యాపేట
4	ఉంద్యాల కౌశిక్ నారాయణ	మహబూబ్‌నగర్
5	చెట్ల షేక్ మహమ్మద్ అష్ఫక్	హైదరాబాద్

వివాదంలో అందాల పోటీలు

- మనస్తాపంతో హైదరాబాద్ నుంచి తిరిగొచ్చాను
- మిస్ ఇంగ్లండ్ మిల్లా మాగి సంచలన ఆరోపణ
- ఆమె ఆరోపణలు అవాస్తవం : సిఇఒ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మిస్ వరల్డ్ పోటీల్లో కొత్త వివాదం నడుస్తోంది. నిర్వాహకుల తీరు రాష్ట్ర ప్రభుత్వంతో పాటు పోటీల్లో పాల్గొంటున్న పోటీదారులకు మింగుడు పడటం లేదు. మిస్ ఇంగ్లండ్ మిల్లా మాగీ చేసిన ఆరోపణలే ఇందుకు నిదర్శనం. వ్యక్తిగత కారణాలతో పోటీల నుంచి తప్పుకున్నానని పేర్కొంటూ మే 16న ఆమె ఇంగ్లండ్ వెళ్లిపోయారు. అయితే అక్కడి వెళ్లిన తర్వాత ఆమె మిస్‌వరల్డ్ సంస్థపై సంచలన ఆరోపణలు చేశారు. ప్రఖ్యాత సన్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు దుమారం లేపాయి. మధ్య వయసున్న పురుషులను ఆనందపెట్టాలని తమపై ఒత్తిడి తీసుకొచ్చారనీ, తమను వేశ్య కంటే అధ్వాన్నంగా చూశారంటూ ఆమె నిర్వాహకులపై విమర్శలు గుప్పించారు. ఈ క్రమంలో మనస్తాపంతో హైదరాబాద్ నుంచి తిరిగొచ్చానని చెప్పారు. ఆమె వ్యాఖ్యలు తెలుగు మీడియాతో పాటు జాతీయ మీడియాలో పెద్ద ఎత్తున ట్రోల్ అవుతున్నాయి.

ఆరోపణలు అవాస్తవం : జూలియా మోర్లే

మిస్ వరల్డ్ పోటీల నుంచి తప్పుకుని స్వదేశం వెళ్లిన మిస్ ఇంగ్లాండ్ 2025 మిల్లా మాగీ చేసిన ఆరోపణలను నిర్వాహకులు కొట్టి పారేశారు. ఈ మేరకు శనివారం మిస్ వరల్డ్ సిఇఒ జూలియా మోర్లే ఒక ప్రకటన విడుదల చేశారు. "మే మొదటి వారంలో మిస్ ఇంగ్లాండ్ మిల్లా తన తల్లి ఆరోగ్యం బాగా లేనందున పోటీల నుంచి విరమించుకుంటున్నట్టు సంస్థకు తెలిపింది.

కోవిడ్, డెంగీ పేరుతో దోపిడీకి ప్రయత్నిస్తే కఠిన చర్యలు

- మంత్రి దామోదర రాజనర్సింహ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కోవిడ్, డెంగీ వ్యాధుల పేరుతో ప్రజలను ఆందోళనకు గురిచేసి, దోచుకునే ప్రయత్నిస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో ఆయన కరోనా వైరస్ వ్యాప్తి, సీజనల్ వ్యాధుల నియంత్రణపై సమీక్షించారు. ఈ సందర్భంగా భారతదేశం, విదేశాల్లో ఉన్న కోవిడ్ పరిస్థితులను అధికారులు, ఎపిడమాలజిస్టులు మంత్రికి వివరించారు. కొన్ని దేశాల్లో కోవిడ్ కేసులు స్వల్పంగా పెరిగినప్పటికీ, హాస్పిటలైజేషన్ చాలా తక్కువగా ఉందని వారు తెలిపారు. ఇండియాలో పరిస్థితి సాధారణంగా ఉందని, జేఎన్ 1 వేరియంట్ కేసులు కొన్ని నమోదయ్యాయనీ, ఈ వేరియంట్ 2023 నుంచే ఇండియాలో వ్యాప్తిలో ఉందని వివరించారు. ప్రస్తుతం ఆందోళనకర పరిస్థితులేమీ లేవని చెప్పారు. ఇతర దీర్ఘకాలిక జబ్బులు ఉన్నవారికి తప్పితే, ఇతరులెవరికీ హాస్పిటలైజేషన్ అవసరం పడడం లేదని వెల్లడించారు. కేంద్ర ఆరోగ్యశాఖ నుంచి రాష్ట్రాలకు ఇప్పటి వరకూ అడ్వైజరీలు, గైడ్‌లైన్స్ ఏమీ రాలేదని అధికారులు మంత్రికి తెలిపారు. పరిస్థితి పూర్తిగా అదుపులో ఉండడం, ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం లేకపోవడమే ఇందుకు కారణమై ఉండొచ్చునని వారు అభిప్రాయపడ్డారు. దాదాపు 3 సంవత్సరాల క్రితమే కోవిడ్ ఎండెమిక్ స్టేజ్‌లోకి వచ్చిందనీ, అప్పుడప్పుడు కేసులు నమోదు అవడం, తగ్గడం, పెరగడం సహజమేనని ఎపిడమాలజిస్టులు మంత్రికి వివరించారు. ఇప్పుడున్న వాతావరణ పరిస్థితులతో ప్రజలు దగ్గు, జలుబు, జ్వరాలు, శ్వాసకోశ వ్యాధుల బారిన పడే అవకాశం కూడా ఉంటుందన్నారు. రాష్ట్రంలో అక్కడక్కడ నమోదయ్యే కోవిడ్ కేసులను మేనేజ్ చేయడానికి అన్ని రకాలుగా సిద్ధంగా ఉన్నామని అధికారులు మంత్రికి తెలిపారు. టెస్టింగ్ కిట్స్, మెడిసిన్ సహా అవసరమైన అన్ని వసతులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

అనంతరం మంత్రి మాట్లాడుతూ ఇతర రాష్ట్రాలు, ఇతర దేశాల్లో పరిస్థితిని నిశితంగా గమనించాలని వారికి సూచించారు. కరోనా, సీజనల్ డిసీజ్‌ల విషయంలో ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. కోవిడ్ గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రజలను కోరారు. వర్షాకాలంలో సీజనల్ డిసీజ్‌ల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జలుబు, దగ్గులాగే కోవిడ్ కూడా ఒకరి నుంచి ఒకరికి వ్యాపిస్తుందనీ, చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవడం, దగ్గు, జలుబు ఉన్నప్పుడు మాస్క్ ధరించడం వల్ల ఒకరి నుంచి ఒకరికి వైరస్‌లు వ్యాపించకుండా ఉంటాయన్నారు. ఇంటి పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలనీ, నీటి నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. నీటి నిల్వ ఉంటే దోమలు పెరిగి, వ్యాధులు వ్యాపించే ప్రమాదముంటుందనీ, ఈ విషయాన్ని ప్రజలకు అర్థమయ్యేలా చెప్పేందుకు అన్ని గ్రామాలు, పట్టణాల్లో కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నివారణ, నియంత్రణపై పంచాయతీరాజ్, మున్సిపల్, ఇతర శాఖలతో కలిసి పని చేయాలని అధికారులకు సూచించారు. అన్ని ఆస్పత్రుల్లో సరిపడా మెడిసిన్, ఇతర రీఏజెంట్స్ సరిపడా అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో వైద్యారోగ్యశాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, టిజిఎంఎస్ఐడిసి ఎండి ఫణీంద్ర రెడ్డి, డిఎంఇ డాక్టర్ నరేంద్రకుమార్, డిహెచ్ డాక్టర్ రవిందర్ నాయక్, వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL (on the file of the Hon'ble Family Court Judge) ANANTHAPURAMU

M.V.O.P. No:256/2023

Between:

1} Bandi Bala Subramanyam, S/o Late Lakshmanna
2} Kuruba Prasanthi, W/o B.Bala Subramanyam,
3} Bandi Aravind, W/o B.Bala Subramanyam, (P.3 is Minor Rep.by his father P.1)

...Petitioners

And

Vikram Regati & 5 Others **...Respondents**

NOTICE TO RESPONDENT NO:3

To,

Shaik Jani Basha S/o Late SK Janimia, aged 53 years, Muslim, R/at Peddadevula Palli Village, Mudugupalli Mandal, Nalgonda District. (T.S)

పై నెంబరు దావాలో మూడవ ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తము పై కోర్టు వారు 30-06-2025వ తేది నాటికి వాయిదా వేసినారు. కావున ఆ రోజు ఉదయం 10:30 గంటలకు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ హాజరై ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. అట్లు హాజరు కాని యెడల పై కేసు మీ పరోక్షము నందు తీర్మానించబడును అని తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

పి.చెన్నారెడ్డి,

వాదిపరం వకీలు, అనంతపురం.

సెల్ నెం:9440093880.

జహీరాబాద్‌లో భారీ వర్షం

- వక్ఫ్ బిల్లు వ్యతిరేక సభలో కూలిన లైట్ల టవర్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని ఈద్గా మైదానంలో వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా శనివారం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో భారీ వర్షం కారణంగా లైట్ల టవర్లు కూలిపోయాయి. దాంతో అక్కడే కూర్చున్న వారికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని జహీరాబాద్ కమ్యూనిటీ వైద్యశాలకు తరలించారు. సభకు వివిధ పార్టీల ప్రముఖులతో పాటు ప్రజలు రావాల్సి ఉంది. సభ ప్రారంభంలోనే సంఘటన చోటు చేసుకోవడంతో పలువురు అక్కడి నుంచి కుర్చీలు తలపై పెట్టుకుని పరుగులు తీశారు. క్షతగాత్రుల వివరాలు తెలియాల్సి ఉంది.

మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషి

- మంత్రి రాజనర్సింహ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సేవాభావంతో సామాన్య ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషి చేయాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. నిలోఫర్, పెట్లబురుజు ఆస్పత్రులకు నూతనంగా సూపరింటెండెంట్లుగా నియమితులైన డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ జయ శనివారం హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి వారిని అభినందించారు. నిలోఫర్, పెట్లబురుజు ఆస్పత్రులు ఎంతో ప్రతిష్టాత్మకమైనవని ఈ సందర్భంగా మంత్రి గుర్తుచేశారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను కాలేజీలకు ఇవ్వొద్దు

- ఫార్మసీ కాలేజీ యాజమాన్యాల సంఘం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం కాలేజీలకు ఇవ్వకుండా నేరుగా విద్యార్థులు, తల్లిదండ్రులకే చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర ఫార్మసీ కాలేజీ యాజమాన్యాల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. వచ్చే విద్యాసంవత్సరం (2025-26) నుంచి నేరుగా విద్యార్థుల నుంచి ట్యూషన్ ఫీజుల వసూలుకు ప్రభుత్వం అనుమతించాలని విజ్ఞప్తి చేసింది. శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో తెలంగాణ ఫార్మసీ కాలేజీ యాజమాన్యాల సంఘం ప్రధాన కార్యదర్శి పి రమేష్ బాబు, గౌరవాధ్యక్షులు కె రాందాస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏడు ప్రభుత్వ, 113 ప్రయివేటు ఫార్మసీ కాలేజీలున్నాయని చెప్పారు. ప్రభుత్వ కాలేజీల్లో 1,500 మంది, ప్రయివేటు కాలేజీల్లో 70 వేల మంది విద్యార్థులు బి ఫార్మసీ, ఎంఫార్మసీ, ఫార్మాడీ కోర్సుల్లో చదువుతున్నారని వివరించారు. ఇందులో 55 వేల మందికి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని పొందుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో 12 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలుంటే, ఫార్మసీ కాలేజీలకు సంబంధించి రూ.550 కోట్లు ఉన్నాయని వివరించారు. ఫీజు బకాయిలు పేరుకుపోవడంతో బోధన, బోధనేతర సిబ్బందికి జీతాలు చెల్లించలేకపోతున్నామని అన్నారు. కొందరు అధ్యాపకులు వెళ్లిపోతున్నారనీ, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినట్టుగా నాలుగేండ్ల ఫీజు బకాయిలను రెండు లేదా మూడు విడతల్లో విడుదల చేయాలని కోరారు. నాలుగేండ్లుగా ఫీజులు రాకపోవడంతో ఫార్మసీ విద్య ప్రమాదంలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఫార్మసీ కాలేజీ యాజమాన్యాల సంఘం సంయుక్త కార్యదర్శులు నర్సింహ్మారెడ్డి, కడియాల సతీశ్, కోశాధికారి బొమ్మ శ్రీధర్, కార్యవర్గ సభ్యులు మధుసూదన్‌రెడ్డి, పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

- పహల్గాం ఉగ్రవాదులను పట్టుకోవడంలో కేంద్రం విఫలం
- హక్కుల కోసం సిఎం రేవంత్ రెడ్డి కేంద్రంతో పోరాడాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అమెరికా అధ్యక్షులు ట్రంప్‌నకు దేశ ప్రధాని నరేంద్రమోడీ భయపడుతున్నారని, అందుకే ఉగ్రవాదుల విషయంలో వెనుకడుగు వేశారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. పహల్గాం ఘటన జరిగి దాదాపు నెల రోజులు కావస్తున్నా ఇప్పటివరకు ఉగ్రవాదులను పట్టుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని టిఎస్‌యుటిఎఫ్ భవన్‌లో శనివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పాకిస్తాన్‌తో దాడులు జరుగుతున్న సమయంలో నరేంద్ర మోడీ కంటే ముందు అమెరికా అధ్యక్షులు ట్రంప్ యుద్ధం ముగిసిందని ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు. ఇప్పటివరకు ఈ విషయంలో ప్రధాని నోరు మెదపడం లేదన్నారు. భారతదేశానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీనా లేదంటే ట్రంపా.. అంటూ ప్రశ్నించారు. భారతదేశంలో ఉత్పత్తి అయిన ఐఫోన్లకు అమెరికాలో 25 శాతం అదనంగా ఎక్సైజ్ సుంకం వేస్తామని అమెరికా అధ్యక్షులు పదేపదే ప్రకటిస్తున్నప్పటికీ మన ప్రధాని ఎందుకు పెదవి విప్పడం లేదన్నారు. అమెరికా అధ్యక్షునికి భయపడటం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని ప్రజలందరూ అనుకుంటున్నారని అన్నారు.

ఆపరేషన్ కగార్ పేరుతో గిరిజనులు, ఆదివాసీలు, వెనుకబడిన తరగతుల వారిని కాల్చి చంపడం ఎంతవరకు సమంజసమని జాన్ వెస్లీ ప్రశ్నించారు. చర్చలకు తాము సిద్ధం అంటూ మావోయిస్టులు ప్రకటించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం మాత్రం ఏకపక్షంగా మావోయిస్టులను కాల్చి చంపడం దారుణమన్నారు. ఇప్పటివరకు దాదాపు 500 మంది మావోయిస్టులను పొట్టన పెట్టుకున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆపరేషన్ కగార్‌ను ఆపేసి.. మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. మావోయిస్టులను ఉగ్రవాదుల కన్నా హీనంగా కేంద్ర ప్రభుత్వం చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఆరు గ్యారంటీ పథకాల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. వాటిని పూర్తిగా విస్మరించారని అన్నారు. రైతు రుణమాఫీతోపాటు రైతు బీమా, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా తదితర పథకాలను రాష్ట్ర ప్రభుత్వం సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నూటికి నూరు శాతం అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి.సాగర్, జిల్లా కార్యదర్శి పర్వతాలు, జిల్లా నాయకులు శ్రీనివాసులు, పాలాది, చింత ఆంజనేయులు, చిలుక బాల్ రెడ్డి, ఆంజనేయులు, పరుశరాములు, ఎపి మల్లయ్య, బాలస్వామి, జగన్ తదితరులు పాల్గొన్నారు.

బిసి గురుకుల జూనియర్ కాలేజీల అడ్మిషన్ల ఫలితాలు విడుదల

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర బిసి గురుకుల విద్యా సంస్థ (ఎంజెపిటిబిసిడబ్ల్యుఆర్ఇఐఎస్) ఆధ్వర్యంలో 2025-26 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ (ఆర్‌జెసి) మొదటి సంవత్సరం అడ్మిషన్లకు సంబంధించి ఫలితాలు ప్రకటించారు. అభ్యర్థులు తమ ఫలితాలను అధికారిక వెబ్‌సైట్ల https://mjptbcwreis.telangana.gov.in, https://mjpabcwreis.cgg.gov.in ద్వారా పరిశీలించవచ్చని మహాత్మా జ్యోతిబా పూలే బిసి గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది వరకు ప్రవేశ పరీక్ష ఆధారంగా సీట్లు కేటాయించగా, ఈ ఏడాది నుండి ఎలాంటి ప్రవేశ పరీక్ష లేకుండా, పదో తరగతిలో విద్యార్థులు సాధించిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయించనున్నట్టు తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో మొత్తం 130 బాలుర కాలేజీల్లో 11,360 సీట్లు ఉండగా, 127 బాలిక కాలేజీల్లో 10,720 సీట్లు కలిపి మొత్తం 22,080 సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా 61,119 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, అందులో 22,080 మంది విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులు తగిన డాక్యుమెంట్లు సిద్ధం చేసుకుని, సంబంధిత కాలేజీల్లో అడ్మిషన్ తీసుకోవాలని ఆయన సూచించారు.

సరస్వతీ పుష్కరాలకు పోటెత్తిన యాత్రికులు

- భారీగా ట్రాఫిక్ జామ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతీ పుష్కరాలకు వెళ్లేందుకు యాత్రికులు పోటెత్తారు. వారంతం కావడంతో అన్ని వాహనాలు కాళేశ్వరం వైపు మళ్లడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. ఎనిమిది కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. వన్ వే రోడ్డు మార్గాన మండలంలోని అన్నారం క్రాస్‌రోడ్ నుంచి వన్ వే రోడ్డు మద్దులపల్లి నుంచి కాళేశ్వరం వరకు నాలుగు గంటల పాటు రోడ్డుపైనే సందర్శకులు ఇబ్బందులు పడ్డారు. మార్గమధ్యలో తాగునీటి సౌకర్యం లేకపోవడంతో అవస్థలు పడ్డారు. మహారాష్ట్ర నుంచి వచ్చే యాత్రికులు కూడా కన్నెపల్లి నుంచి కాళేశ్వరంకు ట్రాఫిక్ జామ్ కావడంతో అనేక కష్టాలు పడ్డారు. విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్, ఎస్‌పి పోలీసుల సహకారంతో ట్రాఫిక్ జామ్‌ను క్లియర్ చేశారు. దాంతో సందర్శకులు ఊపిరి పీల్చుకున్నారు.

ప్రతి నిరుద్యోగినీ ఆదుకుంటాం

- ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు అత్యున్నత సాంకేతికతను అందిస్తాయి
- డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆర్థిక ఇబ్బందులు ఎన్ని ఉన్నా మరో 25 ఏండ్ల అవసరాలకు అనుగుణంగా విద్యుత్ ప్రాజెక్ట్‌లు నిర్మిస్తున్నట్టు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఖమ్మం జిల్లా వైరా జూనియర్ కళాశాల ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన వైరా నియోజక వర్గ స్థాయి జాబ్ మేళాను ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌తో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో భట్టి మాట్లాడుతూ.. వేల సంఖ్యలో హాజరైన నిరుద్యోగులు జాబ్ మేళాలో లభిస్తున్న ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వేతనాల పట్ల నిరుత్సాహపడకూడదని, దీన్ని ఉపయోగించుకుంటూ మెరుగైన మరో అవకాశం కోసం ప్రయత్నాలు కొనసాగిస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని యువతకు విజ్ఞప్తి చేశారు. ఒక గిరిజన నియోజకవర్గంలో చదువుకున్న యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఎమ్మెల్యేగా రాందాస్ నాయక్ పరితపించారని, అందుకు సింగరేణి కాలరీస్ సహకారం లభించిందని అన్నారు. థర్మల్, విండ్, సోలార్, హైడల్.. ఎక్కడ ఏది అనువుగా ఉంటే దాన్ని నిర్మించి విద్యుత్ రంగంలో ముందుకు పోతున్నామన్నారు.


ఉద్యోగ అవకాశం పొందిన వారితో డిప్యూటీ సిఎం భట్టి, తదితరులు

ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేసి విద్యార్థులకు ప్రపంచంతో పోటీ పడేలా అత్యున్నత స్థాయి సాంకేతికతను అందించేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. గోదావరి జలాలను వైరా ప్రాజెక్ట్‌కు మళ్లించేందుకు ప్రత్యేకంగా రూ.100 కోట్లు కేటాయించినట్టు చెప్పారు. వైరా ప్రాజెక్ట్ కుడి, ఎడమ కాలువల ఆధునీకరణకు రూ.42 కోట్ల నిధులు విడుదల చేయగా పనులు జరుగుతున్నాయన్నారు. గిరి వికాసం పథకం కింద గిరిజనుల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో గిరిజన, దళిత, బిసిల బిడ్డలు చదువుకుని ఉపాధి కోసం ఎదురు చూస్తున్న విషయాన్ని గమనించి రాష్ట్ర ప్రభుత్వ ఆమోదంతో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చొరవతో సింగరేణి కాలరీస్ సహకారంతో ఈ జాబ్ మేళా నిర్వాహిస్తున్నట్టు తెలిపారు. సుమారు 8200 మంది ఆన్‌లైన్‌లో పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోగా, మరో 2000 మంది ఆఫ్‌లైన్‌లో హాజరవుతున్నట్టు చెప్పారు.

2 నుంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ..

స్లాట్ బుకింగ్

- ఇప్పటికే 47 చోట్ల విజయవంతంగా అమలు
- నిషేధిత భూముల వివరాలకు ప్రత్యేక పోర్టల్
- త్వరలో గ్రామ పరిపాలనాధికారుల సేవలు
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రిజిస్ట్రేషన్ శాఖలో చేపట్టిన స్లాట్ బుకింగ్ విధానాన్ని జూన్ రెండు నుంచి రాష్ట్రంలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు చేస్తున్నట్టు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో స్లాట్ బుకింగ్ విధానంపై రిజిస్ట్రేషన్ శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఆస్తుల క్రయ, విక్రయదారులకు పారదర్శకంగా సేవలందించేందుకు ప్రయోగాత్మకంగా మొదటి దశలో ఏప్రిల్ 10న 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలో, మే12 నుంచి 25 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు చేస్తున్నామని తెలిపారు. రెండు విడతల్లో 47 చోట్ల అమలు చేసిన విధానం విజయవంతమైందనీ, 94 శాతం మంది ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారని పేర్కొన్నారు. రెండు విడతల్లో కలిపి దాదాపు 36 వేల రిజిస్ట్రేషన్లు జరిగాయని తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి 1.30 గంటల వరకు, మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు స్లాట్ బుకింగ్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఆస్తుల క్రయ, విక్రయదారులు స్లాట్ బుక్ చేసుకున్న తర్వాత డిపార్ట్‌మెంట్ పోర్టల్‌లో పూర్తి వివరాలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో కీలక సంస్కరణలకు స్వీకారం చుట్టామని తెలిపారు. ప్రజలకు వేగవంతమైన, సమర్థమైన సేవలందించడమే లక్ష్యంగా తీసుకొచ్చిన సంస్కరణల అమలు బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు. స్లాట్ బుకింగ్ విధానం దృష్ట్యా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను పునర్వ్యవస్థీకరిస్తున్నామనీ, పని భారం అధికంగా ఉన్న తొమ్మిది చోట్ల అదనపు సబ్ రిజిస్ట్రార్‌తోపాటు సిబ్బందిని నియమించామని తెలిపారు. గ్రామ రెవెన్యూ అధికారుల నియామక పరీక్ష ఆదివారం జెఎన్‌టియు ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ పరీక్షకు సంబంధించి దాదాపు ఐదు వేల మందికి పైగా హాజరవుతారనీ, వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. వీలైనంత త్వరగా వీరి సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి తెలిపారు.

ప్రత్యేక పోర్టల్

నిషేధిత జాబితాలోని ఆస్తులను ఎట్టి పరిస్థితుల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. భూ భారతి తరహాలో ప్రత్యేక పోర్టల్‌ను ఏర్పాటు చేశామనీ, అందులో నిషేధిత ఆస్తుల వివరాలను పొందుపరుస్తామని అన్నారు. ఎక్కడైనా నిషేధిత జాబితాలోని భూమిని రిజిస్ట్రేషన్ చేస్తే క్షణాల్లో హైదరాబాద్‌లోని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ప్రధాన కార్యాలయంలో తెలిసిపోయేలా వ్యవస్థను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. నిబంధనలను కాదని నిషేధిత భూములను రిజిస్ట్రేషన్ చేసే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు.

మూసేసిన ఆస్పత్రుల పేర్లతో సర్టిఫికెట్లు

- జనన, మరణ ధ్రువీకరణ పత్రాల వ్యవహారంపై ప్రత్యేక దృష్టి
- 510 ఆస్పత్రుల యూజర్ ఐడి, పాస్‌వర్డ్‌లు రద్దు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మూసేసిన ఆస్పత్రుల నుంచి జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నారు. ఎవరికైనా ఆధార్‌కార్డుతోపాటు జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు కీలకం. సాధారణంగా పాప, బాబు పుట్టగానే బర్త్ సర్టిఫికెట్ (జనన ధ్రువీకరణపత్రం) తీసుకుంటారు. డెలివరీ అయిన ఆస్పత్రి నుంచి డైరెక్ట్‌గా కార్పొరేషన్ ఆఫీస్‌కు పుట్టిన శిశువు వివరాలు వెళతాయి. ఎవరైన మరణిస్తే ఆ పూర్తి వివరాలను సైతం నమోదు చేస్తున్నారు. ప్రతి సంవత్సరం గ్రేటర్ హైదరాబాద్‌లోని 30 సర్కిళ్లలో దాదాపు నాలుగు లక్షల జననాలు జరుగుతుంటాయి. గ్రేటర్ హైదరాబాద్‌లో నివాసముంటున్న వారితోపాటు ఇతర జిల్లాల నుంచి డెలివరీల కోసం హైదరాబాద్‌కు గర్భిణీలు వస్తుంటారు. ఇక్కడ మెరుగైన వైద్య సదుపాయం అందుతుందన్న నమ్మకంతో వీరిలో కొందరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేరుతుంటే, మరికొందరు ప్రయివేటు ఆస్పత్రుల్లో చేరుతుంటారు. అయితే మూతపడిన ఆస్పత్రుల నుంచి కూడా జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ అవుతుండటం సంచలనం రేపుతోంది. దీనిపై అధికారులు దృష్టి సారించారు. అడ్డదారులు తొక్కుతున్న వారికి చెక్‌పెట్టేందుకు సిద్ధమయ్యారు.

అడ్డదారుల్లో జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు

కొన్ని కార్పొరేట్ ఆస్పత్రులు అడ్డదారుల్లో జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను జారీచేయడం ఒక ఎత్తయితే, కొందరు దళారులు మూతపడిన ఆస్పత్రుల పేర్లతో జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను సృష్టించి పెద్దఎత్తున డబ్బులు దండుకుంటున్నారు. హైదరాబాద్ నగరంలో ఎలాంటి డాక్యుమెంట్లూ లేకుండానే నకిలీ జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ చేసిన వ్యవహారం తాజాగా వెలుగులోకి వచ్చింది. నగరంలోని టోలీచౌకిలోని మెట్రో ఆస్పత్రిని కొన్నాళ్ల క్రితమే మూసేశారు. కాగా, ఆ ఆస్పత్రి నుంచి అధికంగా జనన, మరణాల ధ్రువీకరిస్తూ ఈ సేవా ద్వారా బల్దియాకు వివరాలు వస్తున్నాయి. టోలీచౌకిలోని మెట్రో ఆస్పత్రిల్లో ఎలాంటి డాక్యుమెంట్లు లేకుండా 65 బర్త్, మరో ఎనిమిది డెత్ సర్టిఫికెట్లు జీహెచ్ఎంసీ నుంచి పొందినట్టు అధికారులు గుర్తించారు. గత సంవత్సరం నగరంలో వివిధ ప్రాంతాల్లో 74 మంది శిశువులు ఇంట్లో జన్మించారని, ఇందుకు సంబంధించి బర్త్ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తులు వచ్చాయి. గ్రేటర్‌లో అడుగడుగునా ఆస్పత్రులున్నా ఇంకా హెూమ్ బర్త్ ఏమిటీ అన్న అనుమానం అప్పటి జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తికి రావడంతో ఆయన హోం బర్త్‌లకు జారీ చేసిన బర్త్ సర్టిఫికెట్లపై విచారణ చేయించారు. దాంతో 74 హెూమ్ బర్త్ సర్టిఫికెట్లకు సంబంధించి విచారణ జరిపారు. యూసుఫ్‌గూడ శిశువిహార్‌లోని అనాథ పిల్లలకు చెందిన 38 సర్టిఫికెట్లు హెూమ్ బర్త్ అంటూ సర్టిఫికెట్లు జారీ చేయటం సక్రమమేనని తేలింది. మిగిలిన వాటిపై విచారణ ముమ్మరం చేయటంతో టోలీచౌకిలోని మెట్రో ఆస్పత్రి నుంచి (మూతపడింది) ఎలాంటి డాక్యుమెంట్ల లేకుండానే.. ఆఫీసర్లను, సిబ్బందిని మేనేజ్ చేసుకుని 65 బర్త్, 8 డెత్ సర్టిఫికెట్లు అడ్డదారిలో పొందినట్టు విచారణలో తేలింది. దాంతో సంబంధిత అధికారులు, సిబ్బందిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కొత్తగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ సంబంధిత అధికారులకు ఆదేశించారు.

ఆస్పత్రుల రిజిస్ట్రేషన్ రద్దు

బల్దియాలో ప్రభుత్వ, ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రులు దాదాపు 1823 ఉన్నాయి. వాటిల్లో కొన్ని ఆస్పత్రులు అడ్డదారులు తొక్కుతున్నాయి. అలాంటి వాటిపై జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే 510 ఆస్పత్రులను మూసివేశారు. వాటి యూజర్ ఐడీలు, పాస్ వర్డ్‌ను రద్దు చేశారు.

ఇక తప్పులు చేసిన ఆస్పత్రుల రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని సంబంధిత శాఖను కోరనున్నట్టు తెలిసింది. దాంతోపాటు నకిలీ సర్టిఫికెట్ల జారీలో అంటకాగిన వారితోపాటు సంబంధిత డాక్టర్లు, ఆస్పత్రిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని పోలీస్‌శాఖకు సిఫారస్సు చేసినట్టు తెలిసింది.

డైవర్షన్ కోసమే కవిత ఎపిసోడ్

- మహేశ్ కుమార్ గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ అధినేత కెసిఆర్‌కు ఆయన కుమార్తె, ఆ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాసిన లేఖ విషయం నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే సిఎం రేవంత్ రెడ్డిపై కెటిఆర్ ఆరోపణలు చేస్తున్నారని టిపిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. ఈ మేరకు శనివారం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. ఇంట్లో కుంపటి తట్టుకోలేక కెటిఆర్ సతమతం అవుతున్నారనీ, ఏకు మేకై మరో పవర్ సెంటర్ రావడంతో కెటిఆర్‌కు మతిభ్రమించిందని ఎద్దేవా చేశారు. పది సంవత్సరాల టీఆర్ఎస్ తప్పిదాలను కవిత ఎత్తిచూపారని, ఆ తప్పిదాలన్ని ప్రజలకు అర్థమవుతున్నాయని తెలిపారు. కాళేశ్వరం అవినీతిలో కెసిఆర్‌కు నోటీసులు రావడంతో కెటిఆర్ భయపడుతున్నారని చెప్పారు. కవిత వ్యాఖ్యలతో బిఆర్ఎస్‌కు, బిజెపికి మధ్య స్పష్టమైన అవగాహన ఉన్న విషయం స్పష్టమైందన్నారు. బిఆర్ఎస్ మూడు ముక్కలు కాబోతుందనీ, కవిత, కెటిఆర్ మధ్య పోటీ తీవ్రం కావడంతో అదును కోసం హరీశ్ రావు ఎదురు చూస్తున్నారనీ, దిక్కుతోచని స్థితిలో కెసిఆర్ ఫామ్ హౌస్‌కు పరిమితమయ్యారని వ్యాఖ్యానించారు. పదేళ్ల అవినీతిలో పంపకాల్లో వచ్చిన తేడాతోనే, కవిత జెండా ఎగరవేసినట్లు అర్థమవుతుందన్నారు.

కెటిఆర్ తీరును మార్చుకోవాలి

- టిపిసిసి అధికార ప్రతినిధి చనగాని దయాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బీఆర్ఎస్ పార్టీలో ఆధిపత్యం కోసం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తన సొంత చెల్లినే ఓర్వలేకపోతున్నారని టిపిసిసి అధికార ప్రతినిధి చనగాని దయాకర్ విమర్శించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేసీఆర్ చుట్టూ దొంగలు చేరారనీ, ప్రజల వద్దకు ఆ పార్టీ వెళ్లే పరిస్థితి లేదంటూ కవిత రాసిన లేఖపై కేటీఆర్ ముఖం చాటేశారని తెలిపారు. తెలంగాణ అభివృద్ధికి కేటీఆర్‌గా అడ్డుపడుతున్నారనీ, కేటీఆర్ వ్యవహారశైలితో బీఆర్ఎస్‌లో మరిన్ని విస్ఫోటనాలు రానున్నాయని చెప్పారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభను కేటీఆర్ తన పట్టాభిషేక సభగా మార్చుకున్నారని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డిపై చేసిన అహంకారపూరిత వ్యాఖ్యలే కేటీఆర్ పతనానికి మూలమవుతాయని తెలిపారు. కేటీఆర్ తీరు మార్చుకోకుంటే గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

ప్రతి కార్యకర్త పని చేయాలి : విహెచ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిసిసి మాజీ అధ్యక్షులు వి.హనుమంతరావు పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లో అంబర్‌పేట్ నియోజకవర్గం ఇన్‌ఛార్జి డాక్టర్ రోహిన్ రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీహెచ్ మాట్లాడుతూ.. రాబోయే స్థానిక ఎన్నికల కోసం పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా ముందుకెళ్లాలని సూచించారు.

సెమినార్‌లో మాట్లాడుతున్న జగదీశ్‌రెడ్డి

అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్

- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అధికారంలోకి రావడం కోసం కాంగ్రెస్ ఎన్నో అబద్ధాలు చెప్పి ప్రజలను మభ్యపెట్టిందని, ఒక అబద్ధాన్ని వందసార్లు చెప్పి ప్రజలను నమ్మించి బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని రాకుండా చేసిందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి అన్నారు. బిజెపి నాయకులు కూడా వారికి వంత పాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఓడగొట్టారని తెలిపారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల ఇసిఇ ఆడిటోరియంలో శనివారం "తెలంగాణ రాష్ట్రం - నీళు నిధులు, నియామకాలు" అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేండ్లు తెలంగాణలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు తెలిపారు. గత ప్రభుత్వం నీళ్లు, నిధులు నియామకాలు సృష్టించిందంటూ వివరించారు. రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు దక్కుతుందన్నారు. టిఎన్‌జిఒ మాజీ అధ్యక్షులు దేవీ ప్రసాద్ మాట్లాడుతూ.. ఉద్యోగాల విషయంలో గత ప్రభుత్వంపై అబద్ధాలు ప్రచారం చేయడంలో కాంగ్రెస్ ముందంజలో నిలిచిందన్నారు. ఉద్యోగాలు ఇచ్చి కూడా బిఆర్ఎస్ ప్రభుత్వం చెప్పుకోలేకపోయిందని తెలిపారు. ఇకనైనా మనం మేల్కొని మనం ఇచ్చిన ఉద్యోగాలు, నీళ్లు, నిధుల గురించి వీలైన చోటల్లా సెమినార్లు నిర్వహించుకొని మేధావులు, విద్యార్థులు, మహిళలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. సీనియర్ జర్నలిస్ట్ టంకశాల అశోక్ మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ ఏ విధంగా ఉండేదో, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో ఏ విధంగా అభివృద్ధి జరిగిందో యూనివర్సిటీలో ఉన్న రీసెర్చ్ స్కాలర్స్ పరిశోధనలు చేసి తెలంగాణ సమాజానికి వివరించాలని సూచించారు. మరొక్కసారి విద్యార్థులు ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గదారి కిషోర్, బిసి కమిషన్ మాజీ మెంబర్ ఉపేందర్, జర్నలిస్టు యోగి, బిఆర్ఎస్‌వీ, బిఆర్ఎస్‌వై రాష్ట్ర నాయకులు సతీష్, నెవురి ధర్మేందర్ రెడ్డి, తోట్ల స్వామీ యాదవ్, వీరబాబు, సుందర్, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిఐటియు భవన నిర్మాణానికి కార్మికుల విరాళాలు

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కార్మిక హక్కుల పోరాట సారధి సిఐటియు రాష్ట్ర కార్యాలయం భవన నిర్మాణానికి కార్మికులే ముందుకు వచ్చి పెద్ద ఎత్తున విరాళాలు అందజేస్తున్నారని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. సిఐటియు రాష్ట్ర భవన నిర్మాణానికి చర్లపల్లి పారిశ్రామిక ప్రాంతంలోని గోదావరి పాలిమర్స్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రూ. ఐదు లక్షలు విరాళం అందించింది. ఈ మేరకు శనివారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమలానగర్‌లోని సిపిఎం కార్యాలయంలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్‌కు గోదావరి పాలిమర్స్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డి. ప్రభాకర్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. సంఘటిత రంగం నుంచి అసంఘటిత రంగంలో పనిచేసే ప్రతి కార్మికుడు తమ వంతు కర్తవ్యంగా ఒకరోజు వేతనాన్ని భవన నిర్మాణానికి విరాళంగా అందజేశారని తెలిపారు. వారికి సిఐటియు రాష్ట్ర కమిటీ విప్లవ అభినందనలు తెలియజేస్తున్నదన్నారు. కార్మిక హక్కులు కాలరాస్తున్న ఈ తరుణంలో కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత, కార్మిక వ్యతిరేక విధానాల పైన పోరాడే ఏకైక సంఘం సిఐటియు అని కార్మికులు పెద్ద ఎత్తున ముందుకు వచ్చారని చెప్పారు. ఈ నెల 30న సిఐటియు అఖిల భారత ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.చంద్రశేఖర్, జిల్లా మాజీ అధ్యక్షులు పి.సత్యం, చర్లపల్లి ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసులు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.సునీత, గౌసియా తదితరులు పాల్గొన్నారు.